క్లుప్తంగా

ఐఎంఏ రాష్ట్ర సభ్యురాలిగా డాక్టర్ స్వరాజ్యలక్ష్మి


డాక్టర్ మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి

భీమవరం: ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర స్టాండింగ్ యాక్షన్ కమిటీ సభ్యురాలిగా భీమవరం పట్టణానికి చెందిన డాక్టర్ మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ఆమె గతంలో భీమవరం ఐఎంఏ కార్యదర్శిగా పనిచేయగా, ఆ సమయంలో నేషనల్ బెస్ట్ లీడర్, బెస్ట్ లేడీ సెక్రటరీగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ తనను రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమెకు భీమవరం ఐఎంఏ సభ్యులు అభినందనలు తెలిపారు.

రైస్ మిల్లర్ శ్రీరామరాజుకు పరామర్శ


వెంకట విజయలక్ష్మికి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: మాతృమూర్తి మరణంతో శోకసంద్రంలో ఉన్న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజును బుధవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆనంద్ గ్రూప్ చైర్మన్ ఉద్దరాజు విశ్వనాథరాజు, ప్రముఖ రైస్ మిల్లర్ కాకులపాటి రాధాకృష్ణ, కంతేటి వెంకటరాజు తదితరులు వెంకట విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జంతువులను ఆదరించాలి


ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జంతువులను ఆదరించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జాతీయ జంతు సంరక్షణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ చెట్లను నరికివేయడం వల్ల మూగజీవాలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, ఎస్కే చాన్‌బాషా, సుంకర దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల చోరీపై కేసు నమోదు


స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు

వీరవాసరం: మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ బుధవారం తెలిపారు. మడుగు పోలవరం శివారు జొన్నలపాలెం–1 గ్రామానికి చెందిన వేంద్ర వెంకటేశ్వరరావు దఫదఫాలుగా వీరవాసరం, నవుడూరు, నందమూరి గరువు తదితర గ్రామాల్లో 6 మోటార్ సైకిళ్లను దొంగిలించాడు. వీరవాసరం పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో దొంగను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉంచిన 6 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజపర్చినట్లు పోలీసులు తెలిపారు. ఇతను గతంలో మోటార్ సైకిల్ దొంగతనం కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. ఎస్సై పి.రమేష్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

8న ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: ఈనెల 8వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీలు, గౌరవ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఆకివీడు: విజయవాడ నుంచి ఆకివీడులోని తన సోదరి ఇంటికి వచ్చిన బాలిక(15) కనిపించకుండా పోయిందని ఆమె సోదరి సూర్యకుమారి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బాలిక కన్పించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు.

ఆర్థిక పరిపుష్టిలో సహకార బ్యాంక్‌లు

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


ఆకివీడు రూరల్ బ్యాంక్ సభ్యులకు డివిడెండ్ సొమ్మును పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు

ఆకివీడు: ఆర్థిక పరిపుష్టితో సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని చిన కాపవరం గోడౌన్ వద్ద ఆకివీడు రూరల్ బ్యాంక్(సొసైటీ) సభ్యులకు డివిడెండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సేవలందించే సొసైటీలు లాభాల బాటలో నడుస్తున్నాయంటే రైతు సేవల్లో విజయం సాధించినట్లేనన్నారు. సభ్యులు నిజాయితీగా పని చేయడంతో సొసైటీలు నష్టాల వైపు చూడలేదన్నారు. రైతులకు సకాలంలో రుణ సౌకర్యం కల్పించి, పంట సాగుకు సహకరిస్తున్నాయని చెప్పారు. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, వ్యవసాయ సామాగ్రిని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రైతు పక్షపాతిగా పనిచేస్తున్న ప్రభుత్వం సకాలంలో పంటల బీమా, పంట నష్టపరిహారం అందజేస్తున్నాయని నర్సింహరాజు చెప్పారు. గత ప్రభుత్వాలు రైతుల్ని పట్టించుకోలేదన్నారు. వ్యవసాయం దండగ అని చెప్పిన ప్రభుత్వాలకు రైతుల గురించి మాట్లాడే హక్కులేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత రైతులు ఆర్థికంగా నిలబడటమే కాకుండా, రైతులకు సంఘంలో విలువ పెరిగిందని అన్నారు. అప్పుల బాధలు తప్పాయని చెప్పారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చివేశారన్నారు. పండిన పంట చేతికందిన వెంటనే ధాన్యం కొనుగోలు చేసి వారం రోజుల్లోనే డబ్బు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న ఏకైక సీఎం జగన్ అని నర్సింహరాజు అన్నారు. ఆకివీడు రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి ఆధ్వర్యాన బ్యాంక్ విజయపథంలో నడుస్తుందన్నారు. లాభాల బాటలో ఉన్న బ్యాంక్ డివిడెండ్లను పంపిణీ చేయడం గర్వకారణమన్నారు. గత పాలకులు డివిడెండ్లు పంపిణీ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 4,500 మంది సభ్యులకు 2020 నుంచి 2023 వరకు మూడేళ్ల బ్యాంక్ లాభాల నుంచి డివిడెండ్ సొమ్ము రూ.24,12,240లను రైతులకు పంపిణీ చేయనున్నామని తెలిపారు. అదే విధంగా 2018 నుంచి 2022 వరకు సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ కింద రూ. 1,03,70,363లు అందజేస్తున్నట్లు మురళి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, బ్యాంక్ కార్యదర్శి తోట సతీష్, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ విభాగం ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, మండల యూత్ కమిటీ అధ్యక్షుడు అన్యెం కృష్ణ, చిక్కాల చిన్నా, జేసీఎస్ మండల కన్వీనర్ పుప్పాల పండు, బ్యాంక్ సభ్యుడు మందలంక జాన్ వెస్లీ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నాతిరెడ్డి అన్నవరం, కఠారి కేశవరావు, నందమూరి సత్యవతి, వానపల్లి సాయి, భాస్కరరావు, కత్తుల శ్రీను, అల్లూరి తమ్మిరాజు, దింటకుర్తి వెంకన్న, కేశిరెడ్డి దిలీప్, విశ్రాంతి కార్యదర్శి జి.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శివాజీ రాజు, బాలకృష్ణ

పాలకోడేరు: జగనన్న ప్రభుత్వం పేదల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని గొరగనమూడి సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు అన్నారు. బుధవారం హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ మాట్లాడుతూ విద్య వల్లే జీవితాలు బాగుపడతాయి అని చెప్పిన అంబేడ్కర్ బాటలో నడుస్తూ, ఆయన ఆశయాలను జగనన్న కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి, ఉపాధ్యాయిని దుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ప్యానల్ లాయర్ అంబేడ్కర్

భీమవరం అర్బన్: తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించడమే కాక, భవిష్యత్తులో ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిపై ఉందని ప్యానల్ లాయర్ పులిదిండి అంబేడ్కర్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం తాడేరు రోడ్డు ఇందిరమ్మ కాలనీలోని జీఎంసీ బాలయోగి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంబేడ్కర్ మాట్లాడుతూ వీధి బాలల దినోత్సవం ప్రాథమిక లక్ష్యం యువతకు అత్యవసర సహాయం, ఆహారం, దుస్తువులు, నివాసం, విద్యను అందించడమని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని వసతులతో నాణ్యమైన విద్యను సర్కారు పాఠశాలల్లో అందిస్తోందన్నారు. అంతేకాక పేద విద్యార్థుల కోసం అమ్మఒడి, జగనన్న విద్యా కానుక తదితర ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లలు విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. చైల్డ్ కేర్ టోల్ ఫ్రీ నెంబర్ 10988 ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.రంగనాథ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మహేశ్వరి, సీఆర్పీ నాగలక్ష్మి, మహిళా పోలీస్ పిషోన్ రాణి, పారా లీగల్ వలంటీర్ కమల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఆక్వా మేత


ఆక్వా మేత విక్రయాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: ఆక్వా రైతులకు అందుబాటులో మేత విక్రయానికి ఆకివీడు రూరల్ బ్యాంక్ ముందుకు రావడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని చిన కాపవరం గోడౌన్‌లో చేపలు, రొయ్యల మేతల విక్రయ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంత ఆక్వా రైతులు మేత కొనుగోలు చేసి లబ్ధి పొందాలన్నారు. రొయ్యల, చేపలకు నాణ్యమైన మేతను సరసమైన ధరకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి మాట్లాడుతూ నాణ్యత, ప్రమాణాలతో కూడిన మేత విక్రయించడమే తమ సొసైటీ లక్ష్యమన్నారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు రొయ్య మేతను కొనుగోలు చేసి వ్యాపారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కఠారి కేశవరావు, అంబటి రమేష్, నందమూరి సత్యవతి, అన్యం కృష్ణ, చిక్కాల చిన్నా, కత్తుల శ్రీను, కేశిరెడ్డి దిలీప్, దింటకుర్తి వెంకన్న, సొసైటీ కార్యదర్శి తోట సతీష్, విశ్రాంతి కార్యదర్శి జీవీ సూర్యనారాయణమూర్తి, రైతులు పాల్గొన్నారు

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలి


మోగల్లు సచివాలయాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంగీత్ మాథుర్

పాలకోడేరు: నవరత్నాల్లో పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని ట్రైనీ కలెక్టర్ సంగీత్ మాథుర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పాలకోడేరు, వేంద్ర, మోగల్లు గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లలో పురోగతి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై దృష్టి సారించి వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణం నాయుడు, వీఆర్వోలు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


భీమవరంలో ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని సత్కరించిన జిల్లా ఎస్పీ రవిప్రకాష్

భీమవరం: ప్రజలకు దాదాపు 40 ఏళ్లపాటు అంకితభావంతో సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని పోలీసు శాఖ గుర్తుంచుకుంటుందని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై కె.జిలాని, పాలకోడేరు ఏఎస్సై జేవీఎస్ సాయిబాబు, తాడేపల్లిగూడెం ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు, వీరవాసరం హెడ్ కానిస్టేబుల్ వి.సత్యనారాయణను సత్కరించారు. అనంతరం ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు అభినందనలు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, ఎస్బీ సీఐ తిలక్, డీసీఆర్‌బీ సీఐ డి.వెంకటేశ్వరరావు, ఏవో రామమోహనరావు, పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న రాజా రామ్మోహన్‌రాయ్

భీమవరం: నిరంతర పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. బుధవారం భీమవరంలోని యూనియన్ కార్యాలయంలో జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలు, అభివృద్ధి, కొనుగోలు శక్తి పెంచడం, ఉపాధి కల్పించడం, కనీస వేతనాలు అమలు చేయడం వంటి అంశాలు పక్కకు పోయి వ్యక్తిగత అంశాలు ముందుకు రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వీవోఏలు, ఆశా వర్కర్లు, వీఆర్ఏలు ఆందోళనకు సిద్ధమవుతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కర్రా నాగేశ్వరరావు, తెలగంశెట్టి సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు, జవ్వాది శ్రీనివాస్, డి.కళ్యాణి, డి.జ్యోతి, ఎం.ఆంజనేయులు, ఎస్.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

నరసాపురం రూరల్: మండలంలోని సారవ గ్రామంలో బుధవారం పిచ్చికుక్క దాడి చేసి గ్రామానికి చెందిన పలువురిని గాయపర్చింది. గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి ఉదయం 8 గంటల ప్రాంతంలో రహదారి వెంబడి కనబడిన వారందరినీ కరుచుకుంటూ ముందుకు సాగడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. చిన సారవ సెంటర్‌లో కోడెల నాగేశ్వరరావు ఇంటి దగ్గర ఉన్న రెండు మేకలను కుక్క గాయం చేసిన అనంతరం అక్కడికి కూతవేటు దూరంలో కడలి దిలీప్, పితాని పెద్దిరాజు, దొంగ నాగేశ్వరరావులతో పాటు తొమ్మిది మందిని కాళ్లపై గాయం చేసింది. గుబ్బల లీలా దుర్గ అనే బాలిక చేతులపై కూడా గాయ పరిచింది. దీంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు పెద్ద ఎత్తున ఏకమై కుక్కను వెంబడించి హతం చేశారు. కుక్క దాడిలో గాయాలపాలైన వారిలో ఐదుగురు ఎల్బీచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ, మరో నలుగురు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోను చికిత్స చేయించుకున్నట్లు స్థానికులు తెలిపారు.

జూడో పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం


విద్యార్థి సింహాద్రిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ఈనెల 30వ తేదీ మంగళవారం విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల జూడో పోటీల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి దొండపాటి సింహాద్రి గోల్డ్ మెడల్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. బుధవారం సింహాద్రిని కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు సత్కరించిన సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ జనవరి 30వ తేదీన విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో జూడో పోటీలు జరిగాయన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన తమ విద్యార్థి ఫిబ్రవరి 5, 6 తేదీల్లో అమృతసర్‌లోని గురునానక్ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయస్థాయి జూడో పోటీలకు జేఎన్‌టీయూకే జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. అనంతరం సింహాద్రిని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ హరిమోహన్ తదితరులు అభినందించారు.

80 శాతం వరినాట్లు పూర్తి

భీమవరం అర్బన్: మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, రాయలం, అనాకోడేరు, కొమరాడ, నరసింహపురం తదితర గ్రామాల్లో 80 శాతం వరినాట్లు పూర్తైనట్లు వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మిగిలిన రైతులు త్వరితగతిన పూర్తి చేయాలని, లేకుంటే మార్చి, ఏప్రిల్ నెలలో కోత దశలో నీటి ఎద్దటి పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. వరినాట్లు అవకాశం లేని రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరిస్తే రెండు వారాలు ముందుగా కోత దశకు వచ్చి రూ.2 వేలు నుంచి 4 వేలు వరకు ఆదా అవుతుందన్నారు. అదేవిధంగా మండలంలోని సుమారు 4 వేల ఎకరాలు ఈ క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు.

'సిద్ధం' మహాసభను విజయవంతం చేయండి

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న


మాట్లాడుతున్న పెండ్ర వీరన్న

భీమవరం (ప్రకాశంచౌక్): ఏలూరు జిల్లా దెందులూరులో జరిగే సిద్ధం మహాసభను విజయవంతం చేయాలని ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న కోరారు. బుధవారం భీమవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్నారన్నారు. పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా అమ్మఒడి, వైఎస్ఆర్ చేయూత, కాపు నేస్తం, బీసీ నేస్తం, ఇల్లు లేని పేదలకు పక్కా ఇళ్లు కట్టించే కార్యక్రమం, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఆసరా వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా వారికి లక్షలాది రూపాయలు లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మోసపూరిత హామీలు నమ్మవద్దని, వారు అమాయక ప్రజానీకాన్ని మోసం చేయటమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టారని అన్నారు. గతంలో ఎప్పుడూ ఏ ఒక్క పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని, జగనన్న ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దుమ్మెత్తిపోయటమే ప్రధాన అజెండాగా తీసుకున్నారని దుయ్యబట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అందరూ అండగా ఉండాలని ఆయన కోరారు. సమావేశంలో సివిల్ సప్లై విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోసం దీక్షలు


మాట్లాడుతున్న సీపీఐ నేత నాగేశ్వరరావు

భీమవరం: రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక హోదా, హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 7, 8, 9 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద హోదా సాధన సమితి ఆధ్వర్యాన నిర్వహించే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన పార్టీ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపే సమయం ఆసన్నమైందన్నారు. చెల్లబోయిన రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, నెక్కంటి సుబ్బారావు, ఎం.సీతారాంప్రసాద్, కళింగ లక్ష్మణరావు, నామన వెంకటేశ్వరరావు, సనపల శ్రీనివాస్, వైవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై లైంగిక దాడి.. యువకుడిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఓ వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాడేరు గ్రామానికి చెందిన వివాహిత మధ్యాహ్నం సమయంలో బహిర్భూమికి మురుగు కాలువ గట్టు వద్దకు వెళ్లింది. అక్కడ తనపై ఆమె ఇంటికి సమీపంలో ఉంటున్న ప్రేమ్‌సాగర్ అనే వ్యక్తి లైంగిక దాడి చేసినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు తెలిపారు. రూరల్ సీఐ సత్యకిషోర్ దర్యాప్తు చేస్తున్నారు.

'ఆడుదాం ఆంధ్ర'.. ఓ సువర్ణావకాశం



జిల్లా పోటీలకు బయల్దేరిన కబడ్డీ జట్టుతో ఎంపీడీవో రవీంద్ర, సర్పంచ్ కనకదుర్గ

ఉండి: 'ఆడుదాం ఆంధ్ర'.. క్రీడాకారులకు ఓ సువర్ణావకాశమని ఎంపీడీవో ఎస్.రవీంద్ర అన్నారు. బుధవారం నుంచి భీమవరంలో జరిగే 'ఆడుదాం ఆంధ్ర' జిల్లాస్థాయి ఆటల పోటీల్లో పాల్గొనేందుకు బయల్దేరిన ఉండి నియోజకవర్గ స్థాయి మహిళల కబడ్డీ విజేత ఎన్నార్పీ అగ్రహారం జట్టుకు ఎంపీడీవో రవీంద్ర, సర్పంచ్ సూరవరపు కనకదుర్గ అభినందనలు తెలిపి పంపించారు. జిల్లా పోటీల్లో విజేతగా నిలిస్తే రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశం దక్కుతుందని చెప్పారు. అనంతరం కబడ్డీ జట్టు వెళ్లే బస్సును జెండా ఊపి పంపించారు. పోటీల్లో పాల్గొన్న కబడ్డీ జట్టు బుధవారం పాలకొల్లు జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు సూరవరపు వెంకటాచార్యులు, ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మి, కార్యదర్శి జేవీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుంతలో ముసలమ్మ జాతర ప్రారంభం

పెనుగొండ: సిద్ధాంతం రజకుల వీధిలోని రజకుల ఆరాధ్యదైవం పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వెండి తొడుగు, శూలం, ఖడ్గంలు భక్తులు సమర్పించారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఉత్సవాలను ఈ నెల 3న నిర్వహిస్తామని రజక సంఘపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం 7న భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ చంటి రాజు

పాలకోడేరు: మండలంలోని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) సూచించారు. బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులు తమ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిపాదనలను వివరించారు. అనంతరం గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలను అధికారుల దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ చంటిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పన మెరుగుపరచాలని సూచించారు. నిధులు సమస్య లేకుండా పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రకుమార్, తహసీల్దార్ షేక్ హుస్సేన్, వైస్ ఎంపీపీలు ఆదాడ లక్ష్మీతులసి, నరేష్, మండల సర్పంచుల సంఘం కార్యదర్శి బొల్లా శ్రీనివాస్, ఎంపీటీసీలు కాటూరి శాంతకుమారి, తంగెళ్ల మంజుల, కొత్తపల్లి స్వాతి, కె.వెంకటలక్ష్మి, షేక్ పాపాసాహెబ్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.